# పాఠశాల గ్రంథాలయాలు – నాయకత్వం

# School Libraries – Leadership


## రచయిత

పోరెడ్డి అశోక్, ప్రధానోపాధ్యాయుడు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీపూర్

జైనద్ మండలం, ఆదిలాబాద్ జిల్లా

## ఎడిటింగ్

డా. ఎస్. సురేష్ బాబు, కన్సల్టెంట్

స్కూల్ లీడర్షిప్ అకాడమీ,

ఎస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ, హైదరాబాద్

## సలహాదారు

**G.** రమేష్

సంచాలకులు

యస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ


**2024-25**

**స్కూల్ లీడర్ షిప్ అకాడమి**

**ఎస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ, హైదరాబాద్**

**నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్ షిప్,**

**ఎన్.ఐ.ఇ.పి.ఎ. (NCSL – NIEPA), న్యూఢిల్లీ**

# పాఠశాల గ్రంథాలయాలు – నాయకత్వం

## ఈ మాడ్యూల్ లో చర్చించిన అంశాలు

1. పాఠశాల గ్రంథాలయాలు - ప్రస్తుత పరిస్థితి
2. పిల్లలకు పాఠశాల గ్రంథాలయాలు ఎలా లాభసాటి?
3. పాఠశాల గ్రంథాలయాలు ఎన్ని రకాలు?
4. గ్రంథాలయ నిర్వహణలో పాఠశాల నాయకుల పాత్ర
5. గ్రంథాలయ నిర్వహణలో భాగంగా విద్యార్థులు ఏం చేయాలి?
6. ముగింపు.

## ఉపోద్ఘాతం:

విద్యార్థుల అభ్యసనలో గ్రంథాలయ పుస్తకాలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ముఖ్యంగా భాష అభ్యసనలో కావచ్చు, మిగతా విషయాల అభ్యసనలో కూడా గ్రంథాలయ పుస్తకాలకు కీలకమైన స్థానం ఉన్నది. పిల్లలకు చిన్నతనం నుండే పుస్తక పఠనం అలవాటు చేస్తే వారు నిరంతర పాఠకులుగా ఎదిగే అవకాశం ఉంటుంది. అందుకే ప్రతి పాఠశాలలోనూ ఒక గ్రంథాలయం తప్పకుండా ఉండాలి.

ఈ మాడ్యూల్ చదవడం ద్వారా మీరు కింది అంశాలపై అవగాహన పొందుతారు

1. పాఠశాలల్లో ప్రస్తుతము గ్రంథాలయ పరిస్థితిపై అవగాహన పొందుతారు.

2. పిల్లలకు గ్రంథాలయాల పుస్తకాలు ఎలా లాభసాటి అవుతుందో తెలుసుకుంటారు.

3. పాఠశాలల్లో ఎన్ని రకాలుగా గ్రంథాలయాలు నిర్వహించవచ్చో అవగాహన పొందుతారు.

4. పాఠశాల గ్రంథాలయాల నిర్వహణలో పాఠశాల నాయకుల పాత్ర ను తెలుసుకుంటారు.

5. గ్రంథాలయ నిర్వహణలో భాగంగా విద్యార్థులు చేయవలసిన పనుల గురించి అవగాహన పొందుతారు.

ఇప్పుడు పాఠశాల గ్రంథాలయాల గురించి స్పష్టంగా, విడమర్చి తెలుసుకుందాం.

## 1. పాఠశాల గ్రంథాలయాలు - ప్రస్తుత పరిస్థితి

పిల్లల అభ్యసన స్థాయిలపై సర్వే లేవైనా చెప్పేదొక్కటే. 8, 9 తరగతుల పిల్లలు కూడా కనీసం ఒకటి, రెండు తరగతుల స్థాయి పదాలు చదవడం లేదని. దీని ద్వారా భాషాభ్యాసనలో పిల్లలు వెనుకబడి పోతున్నారని మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఇక ఎంతో కొంత చదవడం వచ్చిన పిల్లలు కూడా కేవలం తరగతి పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ఇది పిల్లల మనోవికాసానికి ఒక అంతరాయమే. మరి పిల్లల్లో భాషా సామర్థ్యాలు పెంపొందాలన్నా, విస్తృత పఠనం అలవాటు కావాలన్నా అది పాఠశాల స్థాయి నుండే ప్రారంభం కావాలి. అలా కావాలంటే పిల్లలకు వివిధ రకాలైన పుస్తకాలు అందుబాటులో ఉండాలి. ప్రతి పాఠశాలలోనూ ఒక గ్రంథాలయం ఉండాలి. అంటే గ్రంథాలయము నిర్విరామంగా పనిచేయాలి. కానీ ప్రస్తుత పరిస్థితిని చూస్తే చాలా పాఠశాలల్లో గ్రంథాలయం పనిచేస్తున్న ఆనవాళ్లు కూడా కనబడవు. అంటే ఆ పాఠశాలల్లో పుస్తకాలు లేవని కాదు గానీ అందుబాటులో ఎన్నో పుస్తకాలు ఉన్నా వాటిని సరైన రీతిలో వినియోగించుకోలేని పరిస్థితి. పుస్తకాలు ఏ అల్మారాలోనో, ఓ గదిలో ఏ మూలనో భద్రంగా భద్రపరిచి ఉంటాయి. పుస్తకాలు పిల్లల చేతికి అందిస్తే ఎక్కడ చింపేస్తారనే భయం కావచ్చు, అలా చిరిగిపోతే తనకు ఉద్యోగ పరంగా ఇబ్బంది అవుతుందేమో అని కావచ్చు, పిల్లలకు పుస్తకాలు ఇచ్చి చదివించడం ఎందుకులే అనే భావన కావచ్చు, పిల్లలు తరగతి పుస్తకాలే చదవడం లేదు ఇంకా ఈ గ్రంథాలయ పుస్తకాలు చదువుతారా అనే ఒక అభిప్రాయం కావచ్చు .... ఇవి ఏవైనా కావచ్చు కానీ గ్రంథాలయ పుస్తకాలు మాత్రం పాఠశాలల్లో భద్రంగా ఉంచుతున్నారు. కొన్ని రోజులకు అవి చెదలు పట్టిన పరవాలేదు కానీ విద్యార్థుల చేతిలో నలిగిపోకూడదు చినిగిపోకూడదు అనే ఒక అభిప్రాయం మనకు కనిపిస్తుంది.

## 2. పిల్లలకు గ్రంథాలయ పుస్తకాలు ఎలా లాభసాటి ?



పాఠశాల గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఉపాధ్యాయులకే ఎంతో వెసులుబాటు. పిల్లలకు మరింత లాభసాటి. మరి పిల్లలకు గ్రంథాలయ పుస్తకాలు ఎలా లాభసాటిగా ఉంటుంటో ఇప్పుడు చూద్దాం.

**భాష నైపుణ్యాలు మెరుగు పరచడం:** పిల్లలు పుస్తకాలు చదవడం వల్ల వారిలో శబ్దజాలం, వాక్య నిర్మాణం, సంభాషణ సామర్థ్యం, రచన సామర్థ్యం, భాషశైలి మొదలైనవి పెరిగే అవకాశం ఉంటుంది.

**జ్ఞానాన్ని పెంపొందించడం:** గ్రంథాలయంలో ఉన్న వివిధ రకాలైన పుస్తకాలు అనగా సైన్సు, చరిత్ర, సాహిత్యం, భౌగోళికం, నిఘంటువులు, కథలు, శాస్త్రీయ గ్రంథాలు చదవడం వల్ల ఆయా రంగాల్లో జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి అవకాశం కలుగుతుంది.

**ఆలోచన శక్తి:** పిల్లలు ఎంత ఎక్కువగా పుస్తకాలు చదివితే వారిలో అంతగా ఆలోచన శక్తి, విశ్లేషణ సామర్థ్యాలు పెరుగుతాయి.

**సృజనాత్మకత:** పిల్లలు ఇలా వివిధ రకాల పుస్తకాలు చదవడం ద్వారా వారు కూడా ఒక దశలో కథలు, కవితలు, పద్యాలు, నాటికలు, సంభాషణలు రాయడానికి దోహదం చేస్తుంది. ఇప్పుడు గొప్ప రచయితలుగా ఎదిగిన వారందరూ కూడా వారి విద్యార్థి దశలో పుస్తకాలు ఎక్కువగా చదివిన వారేనని వారి జీవిత చరిత్రలను చదివితే మనకు అర్థమవుతుంది. అందుకే విద్యార్థులలో ఇలాంటి సృజనాత్మకతను పెంచడానికి గ్రంథాలయ పుస్తకాలు చదవడాన్ని ప్రోత్సహించాలి.

**ఏకాగ్రత పెరగడం:** పిల్లలు పుస్తకాలు చదువుతున్నప్పుడు ఆ పుస్తకం పైనే తన దృష్టంతా కేంద్రీకరించడంతో అతనిలో ఏకాగ్రత పెరిగే అవకాశం ఉంటుంది. ఇలా పెరిగిన ఏకాగ్రత వారు మిగతా పనులు చేయడంలో కూడా ఏకాగ్రతను చూపడానికి దోహదపడుతుంది.

**నైతిక విలువలు:** నీతి కథలు, బాల సాహిత్యం చదవడం ద్వారా పిల్లల్లో నైతిక విలువలు, మంచితనము, శ్రమైక జీవనం మొదలైన మంచి విలువలు, మానవత్వ విలువలు పెరిగే అవకాశం ఉంటుంది.

**మెదడు చురుకుదనం:** పుస్తకాలు ఎక్కువగా చదవడం వల్ల మెదడులోని న్యూరాన్లు ఎప్పుడు చలాకీగా ఉండి మెదడు చురుకుదనం పెరుగుతుంది. పుస్తకాలు ఎక్కువ చదివేవారికి వృద్ధాప్య దశలో కూడా అల్జీమర్స్ రాకపోవడానికి ప్రధాన కారణం వారి మెదడులోని న్యూరాన్లు పుస్తకాలు ఎక్కువగా చదవడం వల్ల ఎప్పుడు చురుకుగా ఉండడమే.

**కల్పనా శక్తి:** పిల్లలు పుస్తకాలు చదవడం ద్వారా వారిలో కల్పనా శక్తి, ఊహ శక్తి కూడా పెరుగుతుంది. అందుకే వారికి ఇలాంటి పుస్తకాలు కూడా అందుబాటులో ఉంచాలి.

**గొప్ప వ్యక్తులు - ఆదర్శం:** గొప్ప వ్యక్తుల జీవితాల గురించి చదవడం ద్వారా వారిని ఆదర్శంగా తీసుకోవడం, అలాంటి లక్ష్యాలను నిర్దేశించుకోవడం పిల్లలు చేసే అవకాశం ఉంటుంది. కాబట్టి గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవడం పిల్లలకు అలవాటు చేయాలి.

**చిన్ననాటి నుండి పుస్తక పఠనం:** పిల్లల చిన్న వయస్సు నుంచే పుస్తక పఠనం అలవాటు చేస్తే భవిష్యత్తులో వారు మంచి పాఠకులుగా తయారవుతారు.

**మొబైల్ నుంచి దూరం కావడానికి:** ప్రస్తుతం పిల్లలు తమ సమయాన్ని ఎక్కువగా మొబైల్ చూడడానికి వినియోగిస్తున్నారు. ఒక రకంగా వారు మొబైల్ కు బానిసలుగా తయారవుతున్నారు. దీనివల్ల పిల్లల జీవితాల్లో ఎన్నో విపరీత పరిణామాలు సంభవిస్తున్నాయి. మరి వారిని మొబైల్ వాడకం నుంచి దూరం చేయడానికి పుస్తక పఠనం ఒక మంచి ఆయుధం. ఒక్కసారి పుస్తకాలు చదవడానికి అలవాటు పడితే తనకు తానే మొబైల్ కు దూరం కావడానికి అవకాశం ఉంటుంది. అలాగే ఇతర సామాజిక మాధ్యమాలు టీవీ, ఆన్లైన్ గేమ్స్ మొదలైన వాటికి కూడా పిల్లలను దూరం చేయడానికి పుస్తక పఠనం అలవాటు చేయాలి.



**అన్వేషణ - పరిశోధన:** పిల్లలు ప్రాజెక్టులు చేయడానికి, కొత్త విషయాలను అన్వేషించడానికి కూడా గ్రంథాలయ పుస్తకాలు ఎంతో వినియోగపడతాయి.

**సమయ సద్వినియోగం:** పిల్లలు తమ విరామకాల సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి, ఉపయుక్త కార్యకలాపాలలో నిమగ్నం కావడానికి కూడా గ్రంథాలయం ఉపయోగ పడుతుంది.

**స్వయం అధ్యయనాన్ని ప్రోత్సహించడానికి:** ప్రతి సందర్భంలోనూ ఉపాధ్యాయుడు చెప్పడం పిల్లలు నేర్చుకోవడం అనే సంప్రదాయానికి దూరంగా పిల్లలని స్వీయ అధ్యయనాన్ని ప్రోత్సహించడానికి గ్రంథాలయ పఠనం ఉపయోగపడుతుంది. పిల్లలు స్వయంగా పుస్తకాలు చదివి విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఇది దోహదపడుతుంది.

**సమాజం పట్ల సానుకూల దృక్పథం:** పుస్తకాలు ఎక్కువ చదివిన వారికి సమాజంపై, సామాజిక పరిస్థితులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండడం జరుగుతుంది. దీనివల్ల వారిలో సమాజం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుంది.

ఇలా చెబుతూ వెళ్తే గ్రంథాలయ పుస్తక పఠనం వల్ల ఎన్నెన్నో ఉపయోగాలు ఉన్నాయి. అందుకే పాఠశాల స్థాయిలో గ్రంథాలయ వినియోగాన్ని, పుస్తక పఠనాన్ని పిల్లల్లో అలవాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## 3. పాఠశాలలో గ్రంథాలయాలు ఎన్ని రకాలు ?

పాఠశాలలో పిల్లలకు పుస్తకాలు అందుబాటులో ఉంచడానికి భిన్న వ్యూహాలను అనుసరించవచ్చు. స్థానిక పరిస్థితులకు, పిల్లల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాలుగా పాఠశాల గ్రంథాలయాలు నిర్వహించవచ్చు. అవి

1. సాధారణ గ్రంథాలయం
2. తరగతి గది గ్రంథాలయము
3. ఇంటి వద్దకు గ్రంథాలయము
4. సెలవుల్లో బడి గ్రంధాలయము
5. భోజన విరామ గ్రంథాలయము
6. సంచార గ్రంథాలయము

వీటి నిర్వాహణ గురించి మాట్లాడుకుందాం.

**1. సాధారణ గ్రంథాలయం:** ఇది పాఠశాల అంతటికి ఒకటి ఉంటూ అందరి అవసరాలను తీరుస్తుంది. ఇక్కడ పుస్తకాలు, దినపత్రికలు, మ్యాగజైన్స్ అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు వారికి కేటాయించిన పీరియడ్లో లైబ్రరీకి వచ్చి ఉపాధ్యాయుని లేదా లైబ్రరీ ఇన్చార్జి పర్యవేక్షణలో తమకు తోచిన పుస్తకాలు చదువుతారు. వివిధ తరగతుల పిల్లలు ఏ రోజు ఏ పీరియడ్లో గ్రంథాలయాన్ని విని యోగించుకోవచ్చు



అనేది పాఠశాల సమయసారణిలో ఒక భాగంగా నిర్ణయించబడి ఉండాలి. అప్పుడు ఈ ప్రక్రియ ప్రణాళికబద్ధంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుంది. గ్రంథాలయ గది విద్యార్థులను పుస్తకాలు చదవడానికి అనువైనదిగా, ఆకర్షణీయంగా ఉండాలి. పుస్తకాలు పారదర్శకంగా తలుపులు ఉండే అల్మారాల్లో పెట్టాలి. విద్యార్థులు కూర్చొని చదవడానికి కుర్చీలు, పొడవాటి టేబుల్ ఉండాలి.

ఆదిలాబాద్ జిల్లా లోని లక్ష్మీ పూర్ ఉన్నత పాఠశాలలో ప్రతి బుధవారం అన్ని తరగతులకు చెందిన విద్యార్థులు తమకు కేటాయించిన పెరియడ్లో 45 నిముషాల పాటు ఉపాధ్యాయుని పర్యవేక్షణలో గ్రంథాలయ పుస్తకాలు చదువుతారు. దీనికి హిందీ ఉపాధ్యాయులు ఇన్చార్జిగా వ్యవహరిస్తారు. ఇదే విధానాన్ని ZPHS కూర ఉన్నత పాఠశాలలో కూడా అనుసరిస్తున్నారు.

**2. తరగతిగది గ్రంథాలయం:** తరగతి గదిలో గోడకు వేలాడదీయడం లేదా ఒక చిన్న పెట్టెలో ఉంచడం ద్వారా పిల్లలు ఆ పుస్తకాలను ఎప్పుడైనా వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. కానీ ఇక్కడ కేవలం ఆ తరగతి స్థాయికి సంబంధించిన పుస్తకాలు మాత్రమే అందుబాటులో ఉంచాలి.



**3. ఇంటి వద్దకు గ్రంథాలయం:** పిల్లలకు బడిలో గ్రంధాలయ పుస్తకాలు చదివే అవకాశం కల్పించడంతోపాటు ఇంటికి కూడా తీసుకువెళ్లే వెసులుబాటు కల్పించాలి. దీనికి తరగతి వారీగా పుస్తకాలు తీసుకొని, తిరిగి ఇచ్చే వివరాలు నమోదు చేసే ఒక రిజిస్టర్ కూడా ఉంచాలి. తద్వారా పిల్లలకు పుస్తకాల పట్ల బాధ్యత ఉంటుంది. దీనిని కూడా ఉపాధ్యాయుని పర్యవేక్షణలో నిర్వహించినప్పటికీ తరగతికి ఇద్దరు చొప్పున లైబ్రరీ లీడర్లను నియమిస్తే వారే ఈ ప్రక్రియ అంతా చూసుకోవడానికి అవకాశం కూడా కలుగుతుంది. ఇంటికి ఇస్తున్న పుస్తకాల వివరాల నమోదుకు తరగతి వారీగా ప్రత్యేక రిజిస్టర్లు ఉండాలి. ప్రతి విద్యార్థికి ప్రత్యేక పేజీలు ఉండాలి. ఇది ఒక రకంగా ఉపాధ్యాయుని భారాన్ని తగ్గిస్తుంది. పిల్లలు పుస్తకాలు తిరిగి ఇస్తున్నప్పుడు ప్రతి వారము  కొంతమంది పిల్లలను వారు చదివిన పుస్తకం గురించి వివరించమని చెప్పాలి. అప్పుడు ఇంటికి తీసుకెళ్ళిన పుస్తకాన్ని పిల్లలు చదువుతారు.

ఉదా : ఆదిలాబాద్ జిల్లా లోని లక్ష్మీపూర్ బడిలో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. వారానికి ఒకరోజు విద్యార్థులు తమకు కేటాయించిన పీరియడ్ లో విద్యార్థులకు ఇంటి వద్దకు పుస్తకాలు ఇస్తుంటారు. మళ్ళీ వారం తర్వాత పుస్తకాలు మార్చుకోవడానికి విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. పుస్తకం తిరిగి తీసుకునేటప్పుడు తాము చదివిన పుస్తకం గురించి విద్యార్థులు కొంత వివరిస్తారు. ఇలాంటి విధానాన్నే ZPHS కూర ఉన్నత పాఠశాలలో కూడా గత అయిదు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు.


వేసవి సెలవుల్లో విద్యార్థుల గ్రంథాలయం నిర్వహణ

జైనథ్, న్యూస్‌టుడే: జైనథ్ మండలం కూర గ్రామంలో వేసవి సెలవుల్లో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రంథాలయం నిర్వహణ బాధ్యతను తీసుకున్నారు. సామాన్యశాస్త్రం, బాలమిత్ర, బుజ్జాయి, జీవిత విశేషాలు, వివిధ రకాల కథలకు సంబంధించిన పుస్తకాలు ఇలా 200 పుస్తకాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు అప్పగించారు. వేసవిసెలవుల్లో ప్రారంభించిన గ్రంథాలయ నిర్వహణను ఎనిమిదో తరగతికి చెందిన నలుగురు విద్యార్థులు నిర్వహణ చేపడుతున్నారు. పుస్తకాలను ప్రతి బుధ, శనివారాల్లో పాఠశాలకు సంచిలో తీసుకొచ్చి విద్యార్థులకు అందజేస్తారు. ఆసక్తి గల విద్యార్థులు పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదివి తిరిగి వీటిని నిర్వాహకులకు అందజేస్తారు. మళ్లీ ఇతర పుస్తకాలను తీసుకెళతారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలగడం, చదవడంలో వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా, తెలియని ఎన్నో విశేషాలను ఈ పుస్తకాల ద్వారా తెలుసుకునేందుకు వీలుగా ఉంటుందని అందుకు ఈ గ్రంథాలయ నిర్వహణను విద్యార్థులతో ఏర్పాటు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి అశోక్ తెలిపారు.

కూరలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న గ్రంథాలయ నిర్వాహకులు

**4. సెలవుల్లో బడి గ్రంథాలయం:** పాఠశాలకు ఎక్కువ రోజులు సెలవులు ఉన్నప్పుడు పిల్లలను చదువుల నుంచి దూరం కాకుండా ఉండడానికి సెలవుల్లో బడి గ్రంథాలయాన్ని నిర్వహిస్తే ఉపయుక్తకరంగా ఉంటుంది. సాధారణంగా బడులకు వేసవి సెలవులు, దసరా సెలవులు, సంక్రాంతి సెలవులు అని మూడు రకాలు. ఇందులో వేసవి సెలవులు సుదీర్ఘంగా 50 రోజుల వరకు ఉంటాయి. ఈ సెలవుల్లో బడి గ్రంథాలయ నిర్వహణ కొరకు విద్యార్థులను ఒక కమిటీగా వేసి ఆ కమిటీ ఆధ్వర్యంలో వేసవిలో పిల్లలు పుస్తకాలు ఇవ్వడం, తీసుకోవడం జరిగేట్లు చూడాలి. మొదట్లో ఒకటి, రెండు వారాలు టీచర్లు పర్యవేక్షించిన తర్వాత సమాజ భాగస్వామ్యం, సహకారం కూడా తీసుకోవచ్చు. దీనిని వారానికి ఒకటి లేదా రెండు రోజులు నిర్వహిస్తే సరిపోతుంది. దీనినే మరొకరకంగాను నిర్వహించవచ్చు. పిల్లలకు వేసవి సెలవులకు ముందు ఒక్కొక్కరికి ఒక్కొక్క పుస్తకం ఇచ్చి వాటిని ఒకరి నుంచి మరొకరు బదులు చేసుకుంటూ సెలవు రోజులన్నీ కనీసం 7, 8 పుస్తకాలు చదవడానికి అవకాశం ఉంటుంది. ఈ విధంగా వేసవి బడి గ్రంథాలయం నిర్వహించదానికి తగిన ప్రణాళిక వేసుకుంటే చాలా సులభం కూడా. ఇలా వేసవి బడి గ్రంథాలయం నిర్వహిస్తున్న పాఠశాలలు కూడా ఉన్నాయి.



ఉదా : ఆదిలాబాద్ జిల్లా లోని ZPHS కూర మరియు ZPHS లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాలల్లో వేసవి బడి గ్రంథాలయాన్ని

నిర్వహిస్తున్నారు. దీని నిర్వహణను విద్యార్థుల కమిటీలు చూస్తుంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ వేసవి బడి గ్రంథాలయ నిర్వహణ పట్ల చాలా ఆకర్షితులు అయ్యారు.

**5. భోజన విరామ గ్రంథాలయం:** పిల్లలు భోజన విరామంలో కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి పాఠశాల ఆవరణలో బహిరంగంగా ఎక్కడైనా ఒకటి, రెండు చోట్ల వరండాలో కావచ్చు లేదా మరే చోటనైనా కావచ్చు పుస్తకాలను అందుబాటులో ఉంచితే సరిపోతుంది. పిల్లలు తమకు కావాల్సిన పుస్తకాలు తీసుకొని పాఠశాల ఆవరణలో తమకి ఇష్టమైన చోట కూర్చొని చదువుకోవచ్చు. భోజన విరామం పూర్తయిన తర్వాత తిరిగి ఆ పుస్తకాన్ని తీసుకున్న చోటనే ఉంచితే సరిపోతుంది.

ZPHS లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాలలో ప్రతి రోజూ విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత వరండాలో వేలాడదీసిన పుస్తకాలను తీసుకొని పాఠశాల ఆవరణలో తమకు తోచిన చోట గ్రౌండ్, వరండా, తరగతి గదులు మొదలైన చోట కూర్చుని చదువుతారు. దీనిని ఒక అలవాటుగా చేయడం జరుగుతున్నది.

**6. సంచార గ్రంథాలయం:** పాఠశాల గ్రంథాలయ పుస్తకాలను ఒక సైకిల్ పైన లేదా మరేదైనా వాహనం పై పెట్టి గ్రామంలో తిరుగుతూ పుస్తకాలు అందించడం ద్వారా కూడా గ్రంథాలయాన్ని నిర్వహించవచ్చు. దీనికి ఒక టీచర్ ఇన్చార్జిగా ఉంటూ, విద్యార్థులను నిర్వాహకులుగా ఉంచితే సరిపోతుంది.

పాఠశాలలో నిర్వహించటానికి అవకాశం ఉన్న వివిధ రకాల గ్రంథాలయాల గురించి ఇప్పుడు తెలుసుకున్నాం కదా... ఇప్పుడు పాఠశాలలో గ్రంథాలయ నిర్వహణలో పాఠశాల నాయకుని పాత్ర గురించి తెలుసుకుందాం.

## 4. గ్రంథాలయ నిర్వహణలో పాఠశాల నాయకుని పాత్ర :

**ప్రణాళిక - అభివృద్ధి :** గ్రంథాలయ నిర్వహణ కొరకు పాఠశాల నాయకుడిగా పాఠశాల వార్షిక ప్రణాళికలు రూపొందించే క్రమంలోనే పాఠశాల గ్రంథాలయాన్ని ఒక అంశంగా చేర్చి దాని నిర్వహణ గురించి ప్రణాళిక రూపొందించుకోవాలి. ఇందులో గ్రంథాలయానికి అవసరమైన పత్రికలు, పుస్తకాల ఎంపిక, గ్రంథాలయ నిర్వహణ విధానం, స్థలము, పుస్తకాల

వర్గీకరణ, బాధ్యతల అప్పగింత, పుస్తకం పఠనం ప్రోత్సహించుటకు విద్యార్థులకు నిర్వహించు వివిధ కార్యక్రమాలు, పోటీలు మొ. మరియు నిధులు, వనరుల సేకరణ, వినియోగం మొదలైన అన్ని అంశాల గురించి ఇందులో పేర్కొనాలి.

**గ్రంథాలయ వాతావరణం ఏర్పరచడం:** గ్రంథాలయానికి ప్రత్యేక గదిని కేటాయించడం, అందులో వివిధ రకాలైన పుస్తకాలను ఒక పద్ధతిగా అమర్చడం, పుస్తక పఠనానికి అనువైన అనగా నిశ్శబ్ద వాతావరణం ఉండే విధంగా చూడడం, పుస్తకాలు పిల్లలకు అందుబాటులో ఉండే విధంగా ఆకర్షించే విధంగా ఉండడం కూడా గ్రంథాలయ నిర్వహణలో పాఠశాల నాయకులకి బాధ్యత ఉంది. ఆదిలాబాద్ జిల్లా లోని లక్ష్మీ పూర్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ గదిని విద్యార్థులకు ఆకర్షణీయంగా ఉంచడానికి గోడలపై చిత్రాలు వేయించడం, సూక్తులు రాయించడం జరిగింది.

**వనరుల సేకరణ - వినియోగం:** పాఠశాల గ్రంథాలయ నిర్వహణ కొరకు అవసరమైన నిధులను, పుస్తకాలను సేకరించడం కూడా పాఠశాల నాయకుని బాధ్యతల్లో ఒకటి. వివిధ సంస్థలు, ఎన్జీవోలు, దాతల నుంచి నిధులను సమకూర్చుకొని అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేయాలి. ఇంకను పుస్తకాలను ఉచితంగా అందించే సంస్థలను సంప్రదించి వారి నుంచి పుస్తకాలను సమకూర్చుకోవడం కూడా జరగాలి. వివిధ వ్యక్తుల వద్ద ఉపయోగించి అనగా చదివి నిరుపయోగంగా ఉన్న పుస్తకాలను సేకరించడానికి కూడా ప్రయత్నం చేయాలి. చాలా పాఠశాలల్లో ఇదివరకే ప్రభుత్వంచే పంపిణీ చేయబడిన చాలా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని సరైన రీతిలో వినియోగించుకునే విధంగా కూడా తగిన ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలి.

దాతల నుంచి నిధులు సేకరించిన సందర్భంలో వాటికి సంబంధించిన తగిన జమా ఖర్చుల వివరాలను కూడా నమోదు చేయాలి. వాటి వివరాలను గ్రంథాలయ కమిటీ సమావేశంలో కమిటీ సభ్యులకు అందించాలి.

ZPHS కూర ఉన్నత పాఠశాల కు BREAD సంస్థ ద్వారా రూ. 30000 ల విలువ చేసే అల్మారా, పుస్తకాలను అందించడం జరిగింది. అలాగే NRIVA - పుస్తక మిత్ర సంస్థ సహకారంతో రూ. 40000 ల విలువ గల పుస్తకాలచే లక్ష్మీ పూర్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం జరిగింది. గ్రంథాలయ ప్రారంభోత్సవంలో గ్రామ ప్రజాప్రతినిధులు, పోషకులను కూడా పాలుపంచుకున్నారు.

**గ్రంథాలయ నిర్వహణ కమిటీ ఏర్పాటు:** గ్రంథాలయ నిర్వహణ కొరకు పాఠశాల స్థాయిలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేయాలి. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు గ్రంథాలయ ఇంచార్జి లేదా పాలనాధికారి, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు సభ్యులుగా ఉండాలి. నిర్ణీత కాలావధిలో ఈ కమిటీ సమావేశం అవుతూ పాఠశాల గ్రంధాలయ అభివృద్ధి, నిర్వాహణ గురించి చర్చించాలి.

**గ్రంథాలయ సేవల పర్యవేక్షణ:** పాఠశాలలో గ్రంథాలయ సేవల వినియోగాన్ని పాఠశాల నాయకునిగా ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షించాలి. గ్రంథాలయ ఏర్పాటు లక్ష్యాలకు అనుగుణంగా దాని పనితీరు ఉన్నది లేనిది చూడాలి. విద్యాసంబంధ అంశాల పర్యవేక్షణలో గ్రంథాలయ పర్యవేక్షణ కూడా ఒకటిగా చేర్చుకోవాలి. తరచుగా గ్రంథాలయ పాలకులతో సమీక్షించాలి. విద్యార్థులతో కూడా గ్రంథాలయ పనితీరు గురించి సమీక్షించాలి. వారి అభిప్రాయాలను సేకరించి తదనుగుణంగా గ్రంధాలయ పనితీరులో మార్పులు చేర్పులు చేయాలి. గ్రంధాలయ రిజిస్టర్ల నిర్వహణ తీరు కూడా పర్యవేక్షించాలి.

**పఠన అలవాటును ప్రోత్సహించు కార్యక్రమాల నిర్వహణ:** విద్యార్థులలో పుస్తక పఠనం ప్రోత్సహించడానికి వివిధ రకాలైన కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలి. ఇందులో భాగంగా గ్రంథాలయ వారోత్సవాలు, గ్రంథాలయ దినం నిర్వహించడం, గ్రంథాలయానికి ప్రత్యేక పీరియడ్ని కేటాయించడం, పుస్తకాలపై చర్చా కార్యక్రమాలు నిర్వహించడం లాంటివి చేయాలి.

అలాగే పాఠశాలలో పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలి. తద్వారా పిల్లలు గ్రంథాలయంలో ఉన్న కొత్త పుస్తకాల గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ఇంకా చదివిన కథ, పుస్తకం పై సమీక్ష రాయించడం, దానిని గ్రంథాలయంలో ప్రదర్శించడం కూడా చేయాలి. దీనితోపాటు కథ, పుస్తకం గురించి విద్యార్థులచే మౌఖికంగా కూడా చెప్పించాలి. ప్రార్థన సమావేశంలో ప్రతిరోజు ఒక విద్యార్థితో తాను చదివిన పుస్తకం లేదా కథ గురించి చెప్పించాలి.

గ్రంథాలయ నిర్వహణలో విద్యార్థులను కూడా భాగస్వాములను చేయాలి. దీనికై ప్రతి తరగతికి ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులతో ఒక గ్రంథాలయ కమిటీని ఏర్పాటు చేయాలి. పుస్తకాలు ఇవ్వడం, తిరిగి తీసుకోవడం వంటి పనులకు ఈ విద్యార్థులు బాధ్యత వహించే విధంగా చూడాలి.

మాసాంతంలో ప్రతి విద్యార్థి చదివిన పుస్తకాల సంఖ్యను లెక్కించి, ఆ మాసంలో ఎక్కువ పుస్తకాలు చదివిన విద్యార్థికి బహుమతులు అందించడం జరగాలి. ప్రతివారం ఉపాధ్యాయులచే ఒక కొత్త పుస్తకం పరిచయం చేయించాలి. ఇంకనూ ఈ ప్రక్రియలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయడం ద్వారా కూడా విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించడానికి ప్రధానోపాధ్యాయులు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలి.

ఉదా : లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాలలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసి విద్యార్థులకు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలపై అవగాహన కల్పించడం జరిగింది. పుస్తక ప్రదర్శనలో తల్లిదండ్రులను కూడా భాగస్వామ్యులను చేయడం జరిగింది.

ప్రతి రోజూ ప్రార్థన సమయంలో విద్యార్థులు తాము చదివిన పుస్తకం, కథ గురించి చెబుతుంటారు. విద్యార్థులచే కథలు, కవితలు రాయిస్తుంటారు. ఇలా విద్యార్థులు రాసిన కథలు చెకుముకి, బాలాబట, ప్రజాశక్తి లాంటి పుస్తకాల్లో ముద్రితం అయ్యాయి. అలాగే ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కథా రచన పోటీల్లో ఉత్తమ కథా రచయిత లుగా బహుమతులు అందుకున్నారు. ఇటీవలే డిసెంబర్ 28, 2024 న విద్యార్థులు రాసిన "ఆరోగ్య పాఠశాల - లక్ష్మీపూర్ బడి పిల్లల కథలు," పుస్తకాన్ని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీ రాజర్షి షా IAS గారు ఆవిష్కరించారు.

ZPHS కూర ఉన్నత పాఠశాల కు చెందిన గీస శ్రీజ → శ్రీజ కథలు" అనే పుస్తకం రాసింది. జాతీయ స్థాయిలో యంగ్ ఆచీవర్ అవార్డు అందుకుంది. ఇంకా సృజనాత్మక రచనా విభాగంలో CCRT ఉపకార వేతనంకు కూడా ఎంపికైంది.

**గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణ:** ప్రతి ఏడాది నవంబర్ 14 నుండి 20 వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించడం, పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంచే కార్యక్రమాలు చేపట్టాలి. అలాగే పఠనోత్సవాలు కూడా నిర్వహించాలి.

**స్థానిక గ్రంథాలయాలతో అనుసంధానం:** పాఠశాల గ్రంధాలయాన్ని స్థానిక ఇతర గ్రంథాలయాలతో అనుసంధానం చేస్తూ కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులను అట్టి గ్రంథాలయాల సందర్శనకు తీసుకువెళ్లాలి. ఆ గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకునేట్లు చేసి గ్రంథాలయ పుస్తకాలని కూడా తీసుకునేలా ప్రోత్సహించాలి. గ్రంథాలయ పాలకులను

పాఠశాలకు ఆహ్వానించి పిల్లలతో మాట్లాడించాలి. ఇలా పాఠశాల గ్రంథాలయాన్ని స్థానిక గ్రంథాలయాల తో సహకారం , పరస్పర సమన్వయం చేసుకోవాలి.

**పాఠశాల గ్రంథాలయాన్ని సమాజానికి అందుబాటులో ఉంచడం:** పాఠశాల గ్రంథాలయాన్ని సమాజ సభ్యులకు అనగా యువతకు, గ్రామస్తులకు కూడా అందుబాటులో ఉంచితే బాగుంటుంది. వారిని ఈ గ్రంథాలయ పుస్తకాల వినియోగానికి అవకాశం కల్పించాలి. దాతలుగా వారి నుంచి గ్రంథాలయానికి పుస్తకాలను సేకరించాలి. తద్వారా గ్రంథాలయ నిర్వహణలో సమాజ భాగస్వామ్యానికి అవకాశం కల్పించాలి. లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాల గ్రంథాలయాన్ని గ్రామస్తులు తాము ఉపయోగించుకోవడానికి అవకాశం కల్పించాలని కోరడం జరిగింది. కానీ ఇంకా ఇది పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు.

**వివిధ రకాల గ్రంథాలయాల నిర్వహణ:** మనం ఇంతకుముందే చెప్పుకున్నట్లు సాధారణ గ్రంథాలయం, తరగతి గది గ్రంథాలయం, వేసవి బడి గ్రంథాలయం, భోజన విరామ గ్రంథాలయము, సంచార గ్రంథాలయము లాంటి వివిధ రకాలైన గ్రంథాలయ నిర్వహణ కొరకు పాఠశాల నాయకులు బాధ్యత వహించాలి. దీనికి తగిన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలి.

**గ్రంథాలయాన్ని పాఠశాల నిర్వహణలో ఒక భాగం చేయడం:** పాఠశాల నిర్వహణ అంటే పిల్లలకు పాఠ్య పుస్తకాలలోని పాఠాలు మాత్రమే చెప్పడమే కాకుండా గ్రంథాలయాన్ని కూడా బోధన నిర్వహణలో ఒక భాగం చేయడానికి పాఠశాల నాయకులు ప్రయత్నం చేయాలి. ఉపాధ్యాయులు తమ పాఠ్య బోధనలో విద్యార్థులచే గ్రంథాలయ వినియోగానికి అవకాశం కలిగించే కార్యకలాపాలు నిర్వహించే విధంగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. అప్పుడు విద్యార్థులు కూడా గ్రంథాలయాన్ని తమ అభ్యసనకు తోడ్పడే ఒక వనరుగా గుర్తించే అవకాశం ఉంటుంది.

**బాధ్యతల కేటాయింపు:** సాధారణంగా పాఠశాలలో ప్రత్యేకంగా గ్రంథాలయ పాలనాధికారి పోస్టులు అందుబాటులో ఉండడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాల నాయకులు అందుబాటులో ఉన్న మానవ వనరులలో గ్రంథాలయ నిర్వహణకు ఎవరి సహకారం తీసుకోవచ్చు అనేది నిర్ణయించుకోవాలి. తక్కువ పని భారం ఉన్న అనగా ఒక వారంలో తక్కువ బోధన పీరియడ్లు ఉన్న ఉపాధ్యాయులను దీనికి ఉపయోగించుకోవచ్చు. అదే సందర్భంలో గ్రంథాలయ

నిర్వహణ పట్ల వారి ఆసక్తిని కూడా పరిగణలోకి తీసుకోవాలి. గ్రంథాలయ నిర్వహణ పట్ల ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులకు ఈ బాధ్యతని కేటాయిస్తే వారు గ్రంథాలయాన్ని విజయవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న చోట ఈ బాధ్యతలను ఉపాధ్యాయుల మధ్య పంచడం కూడా జరగాలి. ఒకరికే కాకుండా కొంతమంది ఉపాధ్యాయులు సమిష్టిగా ఈ బాధ్యతను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇలా ఒక ప్రణాళిక బద్ధంగా పాఠశాల గ్రంథాలయ బాధ్యతలను అప్పగించడం ద్వారా పాఠశాల నాయకులు గ్రంథాలయ నిర్వహణను సమర్ధవంతంగా నిర్వహించే విధంగా చూడవచ్చును.

ఉదా : కూర, లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయులు గ్రంథాలయ నిర్వహణ చూస్తుంటారు. ప్రతి వారం ప్రతి తరగతి కి ఒక పీరియడ్ చొప్పున లైబ్రరీ పీరియడ్ ను హిందీ ఉపాధ్యాయులు నిర్వహిస్తుంటారు.

ఈ విధంగా పాఠశాల గ్రంథాలయ నిర్వహణ కొరకు పాఠశాల నాయకులు బాధ్యత వహించవలసి ఉంటుంది.

## 5. గ్రంథాలయ నిర్వహణలో భాగంగా విద్యార్థులు ఏం చేయాలి ?

విద్యార్థులు పాఠ్య పుస్తకాలు చదవడానికే పరిమితం కాకుండా కింద పేర్కొన్న వివిధ రకాలైన కార్యకలాపాలు నిర్వహించే విధంగా చూడాలి. అందులో ముఖ్యంగా

- గ్రంథాలయ కమిటీలో సభ్యులుగా ఉంటూ గ్రంథాలయ నిర్వహణ చేయడం.
- పుస్తక సమీక్షలు రాయడం.
- ప్రార్థన సమయంలో పుస్తక సమీక్షను చెప్పడం.
- చదివిన కథలను చెప్పడం.
- చదివిన కథలను సొంతంగా రాయడం.
- జీవిత చరిత్రల గురించి చెప్పడం, రాయడం.
- కథలోని పాత్రల గురించి చర్చించడం.
- స్వంతంగా పుస్తకాలు కొనుగోలు చేయడాన్ని ఒక అలవాటుగా మార్చడం.

- వివిధ సందర్భాలలో అనగా పుట్టినరోజులకు పుస్తకాలను బహుమతులుగా అందించడం.
- పుస్తకాలు సేకరించి గ్రంథాలయానికి ఇచ్చే అలవాటు చేయడం.

## 6. ముగింపు:

పాఠశాల గ్రంధాలయాలు అనేవి విద్యార్థి అభ్యసనకు ఒక ఆయువుపట్టు లాంటివి. అలాంటి గ్రంథాలయాల నిర్వహణలో పాఠశాల నాయకుల పాత్ర కీలకమైనది. పాఠశాల నాయకులు ముందుండి గ్రంథాలయ నిర్వహణను ప్రోత్సహిస్తే అప్పుడు పాఠశాల గ్రంథాలయము విజయవంతంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుంది. అలా పాఠశాల గ్రంథాలయాన్ని విజయవంతంగా నిర్వహించినప్పుడు విద్యార్థులు కూడా తమ విరామకాల సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ జ్ఞాన సముపార్జనకు అవకాశం కల్పించిన వారం అవుతాం. అందుకే ప్రతి పాఠశాలలోను అందుబాటులో ఉన్న పుస్తకాలతో పాటు, అదనంగా పుస్తకాలను సేకరించి ఒక పూర్తి స్థాయి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి. ఆ పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ నిరంతరాయంగా పాఠశాలలో గ్రంథాలయ నిర్వహణ జరగాలి.

## మీరేం నేర్చుకున్నారు?

1. గ్రంథాలయ పుస్తకాలను విద్యార్థులు ఎందుకు చదవాలి?
2. మీ పాఠశాల గ్రంథాలయ ప్రస్తుత పనితీరును వివరిస్తూ, భవిష్యత్తులో ఎలా నిర్వహిస్తారో రాయండి.
3. గ్రంథాలయ పుస్తకాలు చదివిన తర్వాత పిల్లలు ఏం చేయాలి?
4. పాఠశాల గ్రంథాలయ నిర్వహణలో సమాజ భాగస్వామ్యాన్ని ఎలా పెంపొందిస్తారు?
5. "పాఠశాల గ్రంథాలయాల ఏర్పాటు నిర్వహణలో పాఠశాల నాయకులదే కీలక పాత్ర". వ్యాఖ్యానించండి.


ఆరోగ్య పాఠశాల